క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రం పరిశీలన



నున్న(విజయవాడరూరల్): కేంద్ర బృందం అధికారులు శుక్రవారం నున్న గ్రామంలో పరిసరాల శుభ్రతను పరిశీలించారు. గ్రామంలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యకేంద్రం, సక్షం అంగన్‌వాడీ కేంద్రం, జిల్లా పరిషత్ హైస్కూల్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, ప్రభుత్వ బాలికల వసతి గృహ పరిసర ప్రాంతాలను అధికారులు శారద, సందీప్‌లు పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు వారితో పాటు పర్యటించారు. గ్రామాల్లో తీసుకొంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. గ్రామంలో మెరుగైన శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ



పెనమలూరు:అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు కొత్తగా మంజూరు చేశామని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కానూరు, యనమలకుదురు ప్రాంతాల్లో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో భర్తను కోల్పోయిన వారిలో 209 మంది వితంతువులను ప్రభుత్వం నూతనంగా వితంతు పింఛన్లు మంజూరు చేసిందన్నారు. ఇక ప్రతి నెలా లబ్ధిదారులకు పింఛన్లు అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ షేక్.నజీర్, టీడీపీ నేతలు దోనేపూడిరవి, వెలగపూడి శంకర్‌బబు, నర్రాచంటి, పలువురు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

పెనమలూరు:అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుల వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. పోరంకిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నలుగురు మహిళలకు రూ.2 లక్షలు విలువ చేసే చెక్కులు అందచేశారు. అనారోగ్యంతో ఉండి వైద్య చికిత్స పొందుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అందచేస్తామని ఎమ్మెల్యే ప్రసాద్ తెలిపారు.

పరిసరాల శుభ్రతను పాటించాలి

ఆత్కూరు(గన్నవరం):ఆరోగ్యవంతమైన వాతావరణం కోసం ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. ఉంగుటూరు మండలంలోని ఆత్కూరు గ్రామంలో శుక్రవారం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా వ్యవస్థను ప్రతిరోజు పర్యవేక్షించాలని చెప్పారు. ట్యాంక్‌లను కడిగించి క్లోరినేషన్ చేసి నమోదు చేసే ప్రక్రియను విధిగా నిర్వర్తించాలని సూచించారు. మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటరాజునాయుడు, ఎంపీహెచ్‌ఈఓ జి.రత్నబాబు, ఏఎస్‌ఎం కృష్ణవేణి, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా జెండా మహోత్సవం



కంకిపాడు: ఈడుపుగల్లు గ్రామంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్వజస్తంభంపై జెండా ఆవిష్కరణ మహోత్సవం శ్రావణ మాసం రెండో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎంటీఎంఆర్ ఇన్‌ఫ్రా అధినేత ముసునూరు బాలమన్మధరావు, శ్రీలక్ష్మీ దంపతులు గ్రామంలో వేంచేసిన కామేశ్వర, వీరభద్ర స్వామివార్ల దేవస్థానం (శివాలయం)లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన వీరబ్రహ్మేంద్రస్వామి వారి జెండాను గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు జెండా ఊరేగింపు కార్యక్రమానికి పసుపునీరు ఓరబోసి, మొక్కుబడులు చెల్లించారు. డప్పు కళాకారుల విన్యాసాలు అలరించాయి. ఊరేగింపు అనంతరం ప్రత్యేక జయధ్వానాల నడుమ వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభంపై జెండాను ఆవిష్కరించారు. భక్తులకు అన్నసంతర్పణ జరిపించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి ఊరేగింపు మహోత్సవాన్ని వీక్షించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలుత స్వామివారికి విశేష పూజలు చేయించారు.



తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి

- రెండు అడుగులు వెనక్కి మళ్లిన ఏటిపాయ
- బయట పడని ఏటిపాయ రోడ్డు మార్గం
- రాకపోకలు సాగక రైతులు, కూలీలు ఇబ్బందులు



కాసరనేనివారిపాలెం శివాలయం వద్ద తగ్గిన నీటి మట్టం



మద్దూరు వద్ద ఒడ్డుకు చేర్చిన పడవలు

కంకిపాడు: వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి నీటి విడుదల తగ్గటంతో ఏటిపాయలో నీటి మట్టం క్రమేపీ తగ్గుతోంది. అయితే నీటి ఉధృతి మాత్రం కొనసాగుతోంది. కృష్ణమ్మ సముద్రం వైపు పరుగులు పెడుతోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధి గుండా కృష్ణానది ఏటిపాయ ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రకాశం బ్యారేజీ నుంచి రెండు రోజులు పాటు 2.50 లక్షలు క్యూసెక్కులు వరదనీరు విడుదలైంది. దీంతో ఏటిపాయ నిండు కుండలా ప్రవహించింది. వరదనీరు ఏటిపాయ అంచులు తాకుతూ ఉధృతంగా కడలి వైపు సాగుతోంది. శుక్రవారం ఏటిపాయ స్వల్పంగా తగ్గింది. అంచులు నుంచి నీటి ప్రవాహం రెండు అడుగులు మేర వెనక్కివెళ్లింది. కాసరనేనివారిపాలెం వద్ద నీటి ముంపునకు గురైన శివాలయం బయటపడింది. నీటి ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉందనే భావనతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చి సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకున్నారు.

ముంపులోనే ఏటిపాయ రోడ్డు....

కొద్దిరోజులుగా వరదనీటి ప్రవాహం కారణంగా ఏటిపాయలోని రోడ్డు మార్గం ముంపులోనే ఉంటోంది. ఇటీవల వచ్చిన వరదకు ఏటిపాయ రోడ్డు గండ్లు పడి ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ దఫా వచ్చిన వరదకు పూర్తిగా నీటి ముంపునకు గురైంది. దీంతో ఏటిపాయ రోడ్డు గుంగా లంక భూముల్లోకి వెళ్లేందుకు మార్గం మూసుకుపోయినట్లయ్యింది. పడవలను ఆశ్రయించి రైతులు, కూలీలు పంట పొలాల్లోకి వెళ్లి పనులను నిర్వహించుకుంటున్నారు.



మద్దూరు వద్ద ఏటిపాయలో నీటి ప్రవాహం

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

గన్నవరం రూరల్:విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆకాంక్షించారు. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో 1985–86 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆర్థిక సౌజన్యంతో రూ.6.50లక్షలతో నిర్మించిన నూతన కళావేదికను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళావేదిక నిర్మించటం గొప్ప విషయమని చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావుకి ఆదేశాలిస్తూ వెంటనే పాఠశాల ప్రాంగణం బాగుజేయాలని, మరలా రెండు, మూడు రోజుల్లో సమీక్షిస్తానని పేర్కొన్నారు. ఉత్తరం వైపు ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేయగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎస్టిమేట్లు రెడీ చేయాలని, వెంటనే గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1949 సంవత్సరంలో పాఠశాల భవన కమిటీగా ఏర్పడి హైస్కూల్ నిర్మాణానికి కృషి చేసిన 21 మంది పెద్దల వారసులను వేదికపై సత్కరించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శాలువాలు మెమెంటోతో సన్మానించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఎంపీటీసీలు షేక్ మున్ని, గూటాల భాగ్యరాజ్, ఎంఈవో కొండా రవికుమార్, ఎంఈవో–2 కమల, హెచ్‌ఎం ఎస్.నాగవేణి, విద్యా కమిటీ ఛైర్మన్ షేక్ ముస్తఫావలి, విశ్రాంతి హెచ్‌ఎం ఎంవి సుబ్బారావు, సర్పంచ్ వి.రాధాకృష్ణ, పూర్వ విద్యార్థులు కందిమళ్ళ శ్రీనివాసరావు, హుస్సేన్, గంగవరపు చిన్ని, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ బడుగు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు. సూరంపల్లికి చెందిన కందిమళ్ళ సరస్వతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, పూర్వ విద్యార్థి కందిమళ్ళ శ్రీనివాసరావు గడిచిన సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన షేక్ సల్మాకు రూ.5వేలు నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థిని టి.గాయత్రికి రూ.3వేలు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా అందజేశారు. ట్రస్టు సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేయటం, చదువులకు అండగా ఉండటం స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీనివాసరావును, డాక్టర్ కందిమళ్ళ సందీపను అభినందించారు.



షేక్ సల్మాకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఔషధ రంగంలో కృత్రిమ మేధ పాత్ర కీలకం

రామవరప్పాడు: నానాటికీ విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్న ఔషధ రంగంలో కృత్రిమ మేధ పాత్ర కీలకమయ్యిందని ఫెయిత్ హాస్పిటల్స్ డైరెక్టర్ అనిల్ కంచర్ల అన్నారు. ఎనికేపాడులోని విజయ ఫార్మసీ మహిళా కళాశాలలో శుక్రవారం అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ఇండో గల్ఫ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ మాట్లాడుతూ ఔషధాలను కనిపెట్టే దశ నుంచి వాటిని తయారు చేసే పద్ధతులు, పనిచేసే విధానం కనుగొనడానికి కృత్రిమ మేధస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 2050 నాటికి ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. డాక్టర్ గౌరవ్ గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పొగతాగటం, మద్యం సేవించడం వంటి పలు దుర అలవాట్లు వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే నివారించవచ్చని, వీటిని గుర్తించడానికి కృత్రిమ మేధస్సు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు శాస్త్రీయ ప్రదర్శనలపై పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలత, పలు కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు:తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల నాయకుడు షేక్.ఖాశిం డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ రెండవ మహాసభ యనమలకుదురులో మండల కమిటీ అధ్యక్షురాలు వై.సరళ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాశిం మాట్లాడుతూ కార్మికులందరు ఐక్యతతో ఉండి హక్కుల కోసం పోరాడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ రూ.6 వేలు, సమ్మె కాలం జీతం రూ.4 వేలు వెంటనే కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చెప్పులు, సబ్బులు, దుస్తులు, పనికి సంబంధించిన ఇతర సామగ్రి ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ నజీర్ కార్మికుల సమస్యల పై దృష్టి పెట్టి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తాడిగడప మున్సిపాలిటీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా భిక్షాలు, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీ, కార్యదర్శిగా రోజా, సహాయకార్యదర్శిగా సత్యనారాయణ, 21 మంది సభ్యులతో కమిటీ వేశారు.



యనమలకుదురులో 2వ మహాసభ జెండా ఎగురవేసిన మున్సిపల్ వర్కర్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు:పెనమలూరు గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. విద్యుత్ లైన్స్ మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీని కారణంగా హైస్కూల్ సెంటర్, జెండా చెట్టు సెంటర్, అన్నే బాబూరావు కాలనీ, గౌడబజార్, చెరువుకట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు: మండలంలోని కాటూరు, ఉంగుటూరు మండలం నందమూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. 33/11 కేవీ విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

3635 మందికి అన్నదాత సుఖీభవ

విజయవాడరూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు అన్నదాత సుఖీభవ పథకంలో 3,635 మంది రైతులకు రూ.7వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రభుత్వం శనివారం అందచేస్తుందని మండల వ్యవసాయాధికారి కె.రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్ పథకంలో రూ.2వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు.

నేటి నుంచి ఆధార్ కార్డుల్లో సవరణలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సచివాలయం 2 కార్యాలయంలో శనివారం నుంచి అయిదు రోజుల పాటు ఆధార్ కార్డుల్లో తప్పులను సవరించుకునే కార్యక్రమం నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సవరణలు చేయించుకునేందుకు వచ్చే వారు ఆధార్‌కార్డుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలన్నారు.

కానూరులో ఇద్దరు వ్యక్తులపై దాడి

పెనమలూరు:కానూరులో సినిమా హాల్ పార్కింగ్ వద్ద గొడవ కారణంగా ఇద్దరు వ్యక్తుల పై సినిమా హాల్ సిబ్బంది దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. . యనమలకుదురు సంజీవయ్యనగర్‌కు చెందిన వీరంకి నరేన్, ఆయన మిత్రుడు కానూరు విజయలక్ష్మి సినిమాహాల్‌లో సినిమా చూడటానికి బైక్ పై వచ్చారు. బైక్ పార్కింగ్‌లో పార్కు చేసి రశీదు తీసుకున్నారు. అయితే సినిమా ముగిసిన తరువాత పార్కింగ్‌లో ఉన్న బైక్ రశీదు ఇవ్వకుండా బైక్ నరేన్ తీసుకు వెళుతుండగా రశీదు ఇవ్వాలని పార్కింగ్ వద్ద ఉన్న ప్రణీత్ అడిగాడు. దీంతో వివాదం తలెత్తడంతో నరేన్, అతని మిత్రుడి పై సినిమా హాల్ సిబ్బంది దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లి పాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి

పెనమలూరు:తల్లి పాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్. సులోచన అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గంగూరు 4 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సులోచనరాణి మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమన్నారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉండటం వలన బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ విజయరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.కరుణమ్మ, కె.కరుణకుమారి, ఎం.ప్రమాశారాణి, వి.వినయకుమారి తదితరులున్నారు.

తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు మురళీనగర్‌లో జరిగిన తల్లి పాల వారోత్సవాల్లో సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాలతో బిడ్డ శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. సీహెచ్‌వో దీపిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృత తుల్యం

కంకిపాడు: తల్లిపాలు అమృత తుల్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.అన్నామణి, షేక్ రెహానాబేగం అన్నారు. మండలంలోని గొడవర్రు, కంకిపాడు–7వ అంగన్‌వాడీ కేంద్రం, పునాదిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్నామణి, రెహానా బేగం మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో గొడవర్రు సర్పంచ్‌మేరుగు విజయ చంద్రశేఖర్, కార్యదర్శి దీప్తి, మహిళా సంరక్షణ కార్యదర్శి లక్ష్మీ, ఏఎన్‌ఎంలు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. పునాదిపాడు గ్రామంలో చేపట్టిన వారోత్సవాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు కల్యాణి, సుధారాణి, విజయశ్రీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన తల్లిపాల వారోత్సవాలు

గన్నవరం:స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మంగమ్మ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదన్నారు. సూపర్‌వైజర్ సిహెచ్. నాగపద్మావతి, పలువురు అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.పద్మావతి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

ఉయ్యూరు/ఉయ్యూరురూరల్: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీవో బేబి సుకన్య అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గండిగుంట, బోళ్లపాడులో కార్యక్రమాలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్:తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని, బిడ్డకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి అందుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎం సుజాత, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గంగూరులో తల్లి పాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్ సులోచనరాణి



గొడవర్రులో తల్లిపాల ఆవశ్యకత గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నామణి


పేరంటాలమ్మ ఆలయంలో విశేష పూజలు

రామవరప్పాడు:విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా ఈనెల చివరి వరకూ పలు రకాల పూజలు నిర్వహిస్తామన్నారు.

పెనమలూరు:యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా చేశారు. ఆలయంలో అమ్మవారికి నూతన వస్త్రాలు, వివిధ రకాల పూలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. యనమలకుదురు గ్రామంలో కొండ పై వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం చేశారు. అనంతరం నూతనవస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు చండీ హోమం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. కాగా ఈ నెల 9వ తేదీన శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి గాజుల అలంకరణ చేస్తామని ఈవో భవాని తెలిపారు.



విశేషంగా అలంకారమైన ముగ్గురమ్మలు



అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



అలంకరణలో పార్వతీదేవి

ఏపీ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం వైస్ ఛైర్మన్‌గా కేవీఆర్


గన్నవరం:ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్) సంఘం రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా కృష్ణా జిల్లాకు చెందిన వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ గన్నవరం శాఖ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా జి. కొండూరులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కిషోర్‌ను వైస్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు. కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శిగా కిషోర్ గ్రామీణ ప్రాంతాల్లోని ఉత్తమ క్రీడాకారులకు ఆర్థికంగా సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. అంతే కాకుండా రాష్ట్రంలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమస్యలపై స్పందిస్తూ సంఘం బలోపేతానికి ఆయన తన వంతు కృషి చేస్తున్నారు. వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైన కేవీఆర్ కిషోర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి సీహెచ్ సుధాకర్, కోశాధికారి కన్నంనాయుడు, కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీ రమణ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి డి. నాగరాజు తదితరులు అభినందించారు.



కేవీఆర్. కిషోర్

ముగిసిన బిజినెస్ సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక

గన్నవరం రూరల్:మండలంలోని సూరంపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్టు ద్వారా కొనసాగుతున్న బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్‌లు స్క్రీనింగ్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఏపీఎంఎస్‌ఎంఈ నోడల్ ఏజెన్సీగా, సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడ అమలు భాగస్వామిగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చైర్ పర్సన్ కనకదుర్గ చెప్పారు. మొత్తం 50 మంది అభ్యర్థులు శిక్షణకు గుడివాడ, పెనమలూరు, గన్నవరం ప్రాంతాల నుంచి హాజరయ్యారు. వారిని జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ జీఎం ఆర్.వెంకట్రావు అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలకు శిక్షణ పొందిన సర్వీస్ ప్రొవైడర్‌లు సేవలందించాలని ఆకాంక్షించారు. ఎంపీడీవో స్వర్ణలత, ఏపీఎం సాంబశివరావు, ప్రాజెక్టు మేనేజర్ అజయ్‌బాబు, రీజినల్ మేనేజర్ సునీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండస్ట్రీస్ జీఎం వెంకట్రావు

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ వార్షిక సంబరాలు

గన్నవరం:స్థానిక పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా వార్షిక సంబరాలను వైభవంగా నిర్వహించారు. తొలుత జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతులు అఖండ దీపారాధన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఎన్ఆర్ఐలు కొమ్ము రామ్మోహన్‌రావు, శేషగిరి దంపతులు శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం పరిసర గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు మాను (మహాలక్ష్మీ) పూజలు నిర్వహించారు. అమ్మవారికి గ్రామ పొంగళ్ళను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, తహసీల్దారు కె.వెంకటశివయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, మాజీ సర్పంచ్ గూడపాటి తులసిమోహన్, పలువురు పుర ప్రముఖులు, అధికారులు దర్శించుకున్నారు. వీరిని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ శేషవస్త్రాలతో సత్కారించారు. సాయంత్రం పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి ప్రభ బండ్లు ఊరేగింపు ప్రారంభమయ్యింది. ఎడ్ల బండ్లపై పలువురు దేవుళ్ల ప్రతిమలతో అందంగా అలంకరించిన ప్రభలు స్థానిక ఆగిరిపల్లి రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, బస్టాండ్ మీదుగా జాతీయ రహదారిపై బారులు తీరాయి. ప్రభబండ్లు ప్రదర్శనగా పాతగన్నవరంలోని ఆలయానికి చేరుకున్నారు. రాత్రికి గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ వార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.



ఊరేగింపుగా తరలివస్తున్న ప్రభ బండ్లు



ప్రభబండి ఊరేగింపులో పాల్గొన్న సంఘ నేతలు

గన్నవరం:స్థానిక చెంచులకాలనీలోని లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య వార్ల ఆలయం వద్ద యువజనుల ఆధ్వర్యంలో ప్రభ బండి ఊరేగింపు నిర్వహించారు. బండిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, యాదవ సంఘ నేతలు చిమట గంగాధర్, చిమట రవివర్మ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. డప్పువాయిద్యాలు, యువకుల కోలహాలం మధ్య ప్రభబండి ఊరేగింపుగా బయలుదేరి లక్ష్మీతిరుపతమ్మ ఆలయానికి చేరుకుంది. మధు, పవన్, లీలాసాయి, గోపి, గణేశా, సర్నాల ఆంజనేయులు, శేఖర్, ధనబాబు ఉన్నారు.